

## అప్పటి వరకు జంతర్‌మంతర్‌ను వీడబోం: అభిజీత్ దీప్కే

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** 'నీట్'తో సహా పలు ఇతర పరీక్షల్లో జరిగిన అక్రమాల నేపథ్యంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ పార్టీ ఢిల్లీలో మరోసారి నిరసన చేపట్టింది. ఆయన రాజీనామా చేసేవరకు జంతర్‌మంతర్‌ను వీడబోమని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తేల్చిచెప్పారు. జంతర్‌మంతర్ వద్ద మరికొన్ని రోజులు నిరసన కొనసాగించేందుకు అనుమతివ్వాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో విద్యార్థులు, మద్దతుదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.విద్యావ్యవస్థలో తరచూ జరుగుతున్న తప్పిదాల వల్ల లక్షలమంది విద్యార్థుల భవిష్యత్తు ప్రభావితమవుతున్నా.. విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇంకా పదవిలోనే కొనసాగడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ప్రశ్నపత్రాల లీకేజీ వల్ల విద్యార్థులకు జరుగుతున్న నష్టంపై స్పందించాలని ప్రధాని మోదీకి లేఖ రాశారు.

## కుంభమేళా మోనాలిసాకు భద్రత కల్పించండి: హైకోర్టు



**విశ్వంభర, కొచ్చి:** జాతీయస్థాయిలో వైరలైన కుంభమేళా మోనాలిసాకు భద్రత కల్పించాలని కేరళ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఫర్మాన్‌ఖాన్‌ను మతాంతర వివాహం చేసుకొన్న మోనాలిసా కోర్టుకెక్కిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో మధ్యప్రదేశ్‌లో నమోదైన కిడ్నాప్, పోక్సో కేసుల నేపథ్యంలో తనకు ప్రాణహాని ఉందంటూ ఆమె కోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ రిట్ పిటిషన్ పరిష్కారం అయ్యేవరకు ఆమె ప్రాణాలకు రక్షణ కల్పించాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను జులై 10కి వాయిదా వేసింది. ఈనెల ప్రారంభంలో ఈ కేసుపై దర్యాప్తు చేపట్టిన కేరళ హైకోర్టుకు చెందిన మరో ధర్మాసనం కిడ్నాప్ కేసులో ముందస్తు బెయిల్ కోసం మధ్యప్రదేశ్ కోర్టును ఆశ్రయించేందుకు వీలుగా మోనాలిసా భర్తకు నెల రోజుల పాటు 'ట్రాన్సిట్ బెయిల్' మంజూరు చేసింది. మహారాష్ట్రకు చెందిన ఫర్మాన్ ఖాన్ అనే యువకుడితో ఫేస్‌బుక్ ద్వారా మోనాలిసాకు గతంలో పరిచయం ఏర్పడింది. ఎనిమిది నెలల ప్రేమ అనంతరం వారిద్దరూ తిరువనంతపురం (కేరళ)లోని ఓ ఆలయంలో వివాహం చేసుకున్నారు . ప్రస్తుతం కేరళలో నివాసం ఉంటున్నారు. అయితే, మోనాలిసా మైనర్ అని ఆమె కుటుంబసభ్యులు ఆ తర్వాత ఆరోపించడంతో, ఫర్మాన్‌పై మధ్యప్రదేశ్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## పాక్‌లో మీడియా స్వేచ్ఛ లేదు: జేడీ వాన్స్



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** పాకిస్థాన్‌లో మీడియాకు స్వేచ్ఛ లేదని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అన్నారు. అందువల్లే ఇరాన్‌తో కుదుర్చుకున్న ఒప్పందానికిసంబంధించిన పూర్తి వివరాలను విడుదల చేయడంలో జాప్యం జరిగిందని తెలిపారు. అమెరికా-ఇరాన్ డీల్‌కు ఖతార్‌తో కలిసి పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. జూన్ 15న మధ్యంతర శాంతి ఒప్పందాన్ని ట్రంప్ ప్రకటించగా.. రెండు రోజుల తర్వాత ఈ ఒప్పందం అధికారిక పత్రం విడుదలైంది. పాకిస్థాన్, ఖతార్‌లో పత్రికా స్వేచ్ఛ సరిగ్గా లేకపోవడం, పారదర్శకతపై ఉన్న ఆందోళనల కారణంగానే వివరాలను విడుదల చేయడానికి వాషింగ్టన్ సమయం తీసుకుందని వాన్స్ పేర్కొన్నారు.దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛ, మత స్వేచ్ఛకు భంగం కలిగించే చట్టాలను ప్రభుత్వం అమలు చేయడాన్ని అమెరికా రాజ్యాంగం నిషేధిస్తుందని జేడీ వాన్స్ పేర్కొన్నారు. పాక్‌లో అటువంటి రాజ్యాంగపరమైన రక్షణలు లేకపోవడంతోనే ఈ ఆలస్యం జరిగిందన్నారు. ఇరాన్‌తో చేసుకున్న ఒప్పందంలో ఆ దేశానికి గణనీయమైన రాయితీలు ఇచ్చే అవకాశం ఉన్నందున.. అమెరికా అవగాహన ఒప్పందం వివరాలను గోప్యంగా ఉంచుతోందని వస్తున్న విమర్శలను ఆయన ఖండించారు.

## నెలసరి అయిన బాలికకు పాఠశాలలో అవమానం

**విశ్వంభర, చెన్నై (ఆర్కేనగర్):** నెలసరి అయిన 11 ఏళ్ల విద్యార్థినిని ఉపాధ్యాయుడు తరగతి గది బయట నిలబెట్టిన అమానవీయ ఘటన చెన్నైలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానికంగా ఓ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామం తర్వాత తరగతి ప్రారంభమైంది. ఓ విద్యార్థిని నుంచి దుర్వాసన వస్తోందని ఉపాధ్యాయుడు ఆమెను బయటకు వెళ్లి నిలబడాలని ఆదేశించాడు. దీంతో తీవ్రంగా కలత చెందిన బాలిక గంటల తరబడి తరగతి గది బయటే నిలబడి ఏడ్చింది.పాఠశాల ముగిసిన అనంతరం ఇంటికి వెళ్లాక, తాను ఎదుర్కొన్న అవమానకర ఘటన గురించి తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు, బంధువులు పాఠశాలకు వెళ్లి ఆందోళన చేపట్టారు. సదరు ఉపాధ్యాయుడిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనను నెటిజన్లు, సామాజిక కార్యకర్తలు తీవ్రంగా ఖండించారు. స్పందించిన మంత్రి రాజ్‌మోహన్.. ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్నామని, నివేదిక అందిన తర్వాత చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ట్రంప్ తంటాలకు నెతన్యాహు గండి

# లెబనాన్‌పై మరోసారి దాడులు

**విశ్వంభర,నేషనల్ బ్యూరో:** పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నానా తంటాలు పడుతుంటే.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆ ప్రయత్నాలకు గండికొడుతున్నారు. శనివారం దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైన్యం వైమానిక దాడులు చేసింది. హెజ్‌బొల్లాతో కాల్పుల విరమణకు అంగీకరించినట్టే అంగీకరించి మళ్లీ దాడులు చేసింది. దాంతో లెబనాన్‌లో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.పశ్చిమాసియాలో ఘర్షణలకు ముగింపు పలికేలా వాషింగ్టన్-టెహ్రాన్ కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాన్ని (ఎంవోయూ) ఖాతరు చేయకుండా.. ఇజ్రాయెల్ , హెజ్‌బొల్లా పరస్పర భీకరదాడులు చేసుకున్నాయి. దాంతో యుద్ధం శాశ్వత ముగింపు కోసం అమెరికా-ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్‌లోని జెనీవా వేదికగా శుక్రవారం ప్రారంభం కావాల్సిన సంప్రదింపులు వాయిదా పడ్డాయి. ఆ తర్వాత ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా కాల్పుల విరమణకు అంగీకరించాయి. యూఎస్, ఖతార్ మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణకు ఇరువర్గాలు అంగీకరించినప్పటికీ.. అది ఎంతకాలం కొనసాగుతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. అన్నట్టుగానే కొన్ని గంటల వ్యవధిలోనే లెబనాన్‌పై



ఇజ్రాయెల్ దాడులు చేసింది. యుద్ధ విమానాలు, డ్రోన్లతో నబటియే ప్రాంతంలో అర్ధరాత్రి సమయంలో చేసిన దాడుల్లో నివాస భవనాలు ధ్వంసమయ్యాయని లెబనాన్ మీడియా సంస్థ వెల్లడించింది. మరోవైపు నెతన్యాహు వ్యవహారశైలిపై ట్రంప్ తీవ్ర అసహనంతో ఉన్నారు. హెజ్‌బొల్లాతో కాల్పుల విరమణకు అంగీకరించాలని తాను వ్యక్తిగతంగా ఇజ్రాయెల్‌ను కోరినట్లు ఆయన ఇప్పటికే చెప్పిన సంగతి తెలిసిందే. సంయమనం పాటించాలని ఆ దేశ అధికారులపై ఒత్తిడి తెచ్చానని ఘర్షణలు ఇలాగే కొనసాగితే ఇరాన్‌తో శాంతి ఒప్పందం దెబ్బతినే ప్రమాదం ఉందని వాదించినట్లు చెప్పారు. ప్రశాంతంగా ఉండాలని.. కొంచెం బుర్ర ఉపయోగించి నిర్ణయం తీసుకోవాలని ఇజ్రాయెల్‌కు ట్రంప్ సూచించినట్లు తెలుస్తోంది.

## కాంగ్రెస్ నేత హత్య కేసులో 20 ఏళ్ల తర్వాత నిర్దోషులుగా తీర్పు


**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** మహారాష్ట్ర కాంగ్రెస్ నేతతో పాటు ఆయన కారు డ్రైవర్ హత్య కేసులో శనివారం ముంబయిలోని ప్రత్యేక న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. నిందితులందరినీ నిర్దోషులుగా తేల్చింది. 2006లో ఈ హత్యలు జరగ్గా.. దాదాపు 20 ఏళ్ల తర్వాత తీర్పు రావడం గమనార్హం.పవన్‌రాజే నింబాల్కర్.. ఉస్మానాబాద్‌కు చెందిన ప్రముఖ కాంగ్రెస్ నేత. 2006, జూన్ 3న ముంబయి నుంచి ఉస్మానాబాద్‌కు వస్తున్న నింబాల్కర్ వాహనాన్ని ఇద్దరు వ్యక్తులు అడ్డగించి, కాల్పులు జరిపారు. కలంబోలి ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో కాంగ్రెస్ నేతతో పాటు ఆయన డ్రైవర్ కూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన అప్పట్లో మహారాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. బాంబే హైకోర్టు ఈ కేసును సీబీఐకి అప్పగించింది. ఈ హత్యకు అప్పటి ఎన్సీపీ నేత పదమ్‌సిన్హ్ పాటిల్ కుట్రపన్ని, నిధులు సమకూర్చినట్లు దర్యాప్తు సంస్థ గుర్తించింది. పాటిల్‌తో పాటు మరో ఎనిమిది మందిని నిందితులుగా చేర్చింది. తర్వాత ఒక నిందితుడు అప్రూవర్‌గా మారాడు. రాజకీయ వైరం కారణంగానే ఈ హత్య జరిగిందని సీబీఐ ఛార్జిషీట్‌లో పేర్కొంది. తెర్నా షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని నింబాల్కర్ వ్యతిరేకించడం హత్యకు



పురిగొల్పిందని, అందుకోసం పాటిల్ రూ.30 లక్షల సుపారీ ఇచ్చారని అభియోగాలు మోపింది. అయితే, ఈ ఆరోపణలను పాటిల్ తోసిపుచ్చుతూ వచ్చారు. ఇరుపక్షాల వాదనలు విన్న ప్రత్యేక న్యాయస్థానం ఈ కేసులో ఎనిమిది మందిని నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. మహారాష్ట్ర హోంమంత్రిగా పని చేసిన పాటిల్.. ప్రస్తుత డిప్యూటీ సీఎం సునేత్ర పవార్‌కు సోదరుడు కూడా.

## ఫన్నీగా అంటే.. ప్రపంచమంతా పాకింది


**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** ఫ్రాన్స్‌లో జరిగిన జీ-7 సదస్సులో భాగంగా 'నేను బాస్' అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. వాటిపై ఆయన తాజాగా స్పందించారు. ఆ మాట తాను ఫన్నీగా అంటే.. ప్రపంచమంతా పాకిందని అంతర్జాతీయ మీడియా సంస్థతో మాట్లాడుతూ వివరణ ఇచ్చారు. "జీ-7 సదస్సు లో భాగంగా మీరు వేదిక లోపలికి వచ్చి, ప్రపంచ నేతలందరి ముందు మిమ్మల్ని మీరు బాస్‌గా అభివర్ణించుకున్నారు. ఎంతమంది ఆ మాటను నమ్మి ఉంటారు" అని అధ్యక్షుడిని హోస్ట్ ప్రశ్నించారు. "అందరూ నమ్ముతారు. కానీ నేను ఆ మాట అన్నది సరదాకే. వారంతా నాకు తెలిసినవారు, పలు దేశాల నాయకులు. లోపలికి వచ్చి వారిని చూసి, నేను బాస్‌ను అని చెప్పాను. అదంతా జోక్‌గానే చెప్పా. కానీ ఆ మాట ప్రపంచమంతా పాకింది. అది నేను నమ్మలేకపోతున్నాను. నేను అందరినీ నవ్వించాలనుకున్నాను. నేను పెత్తనం చేయాలనుకోలేదు" అని ట్రంప్ క్లారిటీ ఇచ్చారు.కాగా..



సంపన్న దేశాల కూటమి అయిన 'గ్రూప్ ఆఫ్ సెవెన్'(జీ7) 52వ శిఖరాగ్ర సదస్సు ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగింది.

## మోడీపై థరూర్ ప్రశంసలు.. రాహుల్‌కు బీజేపీ సెటైర్లు

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ ప్రధాని నరేంద్ర మోడీని ప్రశంసించారు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో భారత నావికుల భద్రత విషయాన్ని ప్రధాని మోదీ జీ7 ( సదస్సులో ట్రంప్ దృష్టికి తీసుకువెళ్లారని పేర్కొన్నారు. యుద్ధ సమయంలో వాణిజ్య నౌకా సిబ్బందిని లక్ష్యంగా చేసుకోవడం సరైన చర్య కాదనే భారత్ వైఖరిని స్పష్టం చేశారన్నారు. ఒమన్ తీరంలో ఇటీవల వాణిజ్య నౌకపై అమెరికా చేసిన దాడిలో ముగ్గురు భారత నావికులు మరణించిన ఘటనపై జీ7 సదస్సులో ప్రధాని మోదీ స్పందించలేదని కాంగ్రెస్ విమర్శలు చేస్తోంది. ఈ విషయాన్ని బహిరంగంగా ప్రస్తావించడంలో విఫలమయ్యారని పేర్కొంది. ఈనేపథ్యంలో ప్రధాని విదేశాంగ విధానాన్ని థరూర్ ప్రశంసించడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీనిపై బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ స్పందిస్తూ.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కి సొంత పార్టీలోనే సపోర్ట్ లేదని ఎద్దేవా చేశారు. పుట్టినరోజున (శుక్రవారం) రాహుల్‌కు గిఫ్ట్ రాకుండా.. ఇలాంటి సర్‌ప్రైజ్ రావడం బాధాకరమంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కాంగ్రెస్ పార్టీ నేతలు మోదీ




దౌత్యనీతిని బహిరంగంగా ప్రశంసిస్తున్నారని ప్రదీప్ భండారీ పేర్కొన్నారు. జాతీయ ప్రయోజనాలను కాపాడే విషయంలో దేశంలో ప్రధాని మోదీదే మొదటి స్థానమని అన్నారు. అయితే దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా మాట్లాడే విషయంలో మాత్రం రాహుల్ గాంధీ ముందుంటారని ఎద్దేవా చేశారు. ఈ విషయం కాంగ్రెస్ నేతలతో సహా దేశ ప్రజలందరికీ తెలుసని వ్యాఖ్యానించారు.

## నీట్ రీఎగ్జామ్.. మాక్‌డ్రిల్

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** నీట్ యూజీ పునఃపరీక్ష కు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పటిష్ఠ సన్నాహాలు చేపట్టింది. పరీక్షను సజావుగా, సురక్షితంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు శనివారం దేశవ్యాప్తంగా ఎగ్జామ్ సెంటర్ల వద్ద మాక్ డ్రిల్ నిర్వహిస్తోంది. రాత్రి 8 గంటల వరకు ఈ డ్రిల్ కొనసాగనున్నట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద సన్నద్ధతను పరిశీలించడం, ఈ ప్రక్రియలో పాల్గొనే అధికారుల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే దిల్లీలోని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కార్యాలయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ డ్రిల్‌లో భాగంగా పోలీసులు, పారామిలిటరీ దళాలతో సహా 2.5 లక్షలకు పైగా భద్రతా సిబ్బందిని 5,000కు పైగా పరీక్ష కేంద్రాల వద్ద మోహరించారు. నీట్ పునఃపరీక్ష జూన్ 21న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు 'పెన్-అండ్-పేపర్' విధానంలో (ఆఫ్‌లైన్‌లో) జరగనుంది. దీనికి దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో మొత్తం 22.79 లక్షల మందికి




పైగా అభ్యర్థులు హాజరుకానున్నారు. ఎటువంటి ఆటంకాలు లేకుండా పరీక్షను సజావుగా నిర్వహించేందుకు విస్తృతమైన భద్రతా ఏర్పాట్లుచేసినట్లు అధికారులు వెల్లడించారు.



## బుల్లెట్లే లేని చోట.. ఇప్పుడు మిసైల్స్: అమిత్ షా

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** 12 సంవత్సరాల క్రితం దేశంలో తరచూ బాంబు పేలుళ్లు జరిగితే అప్పటి ప్రభుత్వం గానీ, ప్రధాని గానీ మౌనంగా ఉండేవారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శించారు. కానీ ప్రధాని మోదీ పాలనా కాలంలో ఉరి, పుల్వామా, పహల్గాం దాడులకు భారత్ గట్టిగా జవాబిచ్చిందని చెప్పారు. వైమానిక దాడులు, ఆపరేషన్ సిందూర్ తో శత్రువులపై విరుచుకుపడ్డట్లు తెలిపారు. ఒకప్పుడు బుల్లెట్లు తయారు కాని చోట.. ఇప్పుడు మిసైల్స్ కూడా ఉత్పత్తి అవుతున్నాయని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లాలో ఏర్పాటు చేసిన సభలో అమిత్ షా మాట్లాడుతూ.. మోదీ హయాంలో కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని భద్రతా దళాలు నియంత్రించాయన్నారు. ఈశాన్య ప్రాంతం ప్రశాంతంగా ఉందని, నక్సలిజం అనేది చరిత్రగా మిగిలిపోయిందన్నారు. రైతుల గురించి కాంగ్రెస్ ఎన్నడూ పట్టించుకోలేదని విమర్శించారు.

## కూలిన ఆలయ మండపం పైకప్పు.. ముగ్గురి మృతి



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** మహారాష్ట్రలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. పర్భణీ జిల్లా యశ్వాడీ గ్రామంలోని హనుమాన్ ఆలయ మండపం పైకప్పు కూలిపోయింది. దాంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన పలువురిని స్థానికులు, పోలీసులు బయటకు తీశారు.శనివారం కావడంతో ఉదయం నుంచి భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. రద్దీ ఎక్కువకావడంతో మండపం పైకప్పులో కొంతభాగం, పిల్లర్ కూలిపోయింది. ఆ మండపం నిర్మాణంలో ఉండటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఆకస్మిక ఘటనతో భక్తులంతా ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. శిథిలాల కింద చిక్కుకొన్న 25 మంది భక్తులను బయటకు తీశారు. గాయపడిన వారిని వెంటనే దగ్గర్లోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

## మీ పాపులారిటీపై దృష్టి పెట్టండి - ట్రంప్‌నకు మెలోనీ కౌంటర్



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ , ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. జీ-7 సదస్సుల్లో ఫొటో కోసం మెలోనీ పదే పదే అడిగారని ట్రంప్ మరోసారి చెప్పడంపై ఇటలీ ప్రధాని తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఆయనకు కౌంటర్ ఇచ్చారు."నా ప్రజాదరణ విషయానికొస్తే.. మీ (ట్రంప్) స్నేహితురాలిగా ఉండటం నా పాపులారిటీకి ఏమాత్రం సాయపడలేదు. మీతో ఉన్న స్నేహంపై అది ఆధారపడి లేదు. ఇటలీ జాతీయ ప్రయోజనాలను కాపాడగల సామర్థ్యాలపైనే నా ప్రజాదరణ ఆధారపడి ఉంటుంది. నేను ఎల్లప్పుడూ అదే చేస్తున్నా" అని మెలోనీ పేర్కొన్నారు. ఏదేమైనా తన పాపులారిటీ గురించి ట్రంప్‌నకు ఆందోళన వద్దని అమెరికాలో ప్రజాదరణపైనే దృష్టి పెట్టుకోవాలని సూచిస్తున్నట్లు చెప్పారు.

## హర్మూజ్‌ను మళ్లీ మూసివేస్తున్నాం

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంతో పశ్చిమాసియాలో పరిస్థితులు కుదుటపడుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ నిరంతరం భీకర దాడులు చేస్తుండటాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన కారణంగా తాజాగా హర్మూజ్ మూసివేత నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఇది తమ ప్రతిస్పందనలో మొదటి అడుగు అని, దురాక్రమణ ఇలాగే కొనసాగితే మరిన్ని చర్యలు ఉంటాయని హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ సంయుక్త సైనిక విభాగ కేంద్రమైన ఖతమ్-అల్ అన్బియా ప్రకటించినట్లు అక్కడి అధికారిక మీడియా పేర్కొంది.నౌకలు జలసంధి వైపు రావద్దని.. అలా వస్తే వాటి భద్రతకు ముప్పు వాటిల్లుతుందని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ స్పష్టం చేసింది. ఏదైనా ఒప్పందం అమలు దశలోకి వచ్చినప్పుడు మాత్రమే అన్ని విషయాలు తెలుస్తాయని పేర్కొంది. ఇదే సమయంలో, మధ్యంతర ఒప్పందంపై అమెరికాతో చర్చలు జరిపేందుకు స్విట్జర్లాండ్‌కు తమ బృందం వెళ్తున్నట్లు ఇరాన్ వెల్లడించింది. మరోవైపు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా త్వరలోనే స్విస్‌కు వెళ్లనున్నట్లు సమాచారం. సాంకేతిక అంశాలపై రెండు దేశాలు చర్చలు జరిపేందుకు శుక్రవారమే అక్కడకు వెళ్లాల్సి ఉన్నప్పటికీ.. అది వాయిదా పడిన విషయం తెలిసిందే.

